

ఐఐఎస్‌సీ కౌన్సిల్ సభ్యులుగా ఇద్దరు ఎంపీలు

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) కౌన్సిల్ సభ్యులుగా ఇద్దరు ఎంపీలు ఎంపికయ్యారు. రాయచూరు ఎంపీ కుమారనాయక, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య నామినేట్ అయ్యారు. ఐఐఎస్‌సీకి లోక్‌సభ నుంచి ఇద్దరిని ఎంపిక చేస్తారు. ఈసారి ఇద్దరు మాత్రమే నామినేషన్లు సమర్పించడంతో వారు ఏకగ్రీవమయ్యారు.

నేటి నుంచి.. సభా సమరం..!

- శీతాకాల సమావేశాలకు మస్తాబైన సువర్ణసౌధ
- సర్కారు వైఫల్యాలపై ప్రతిపక్షాల వ్యూహం
- తిప్పికొట్టేందుకు అధికారపక్షం కసరత్తు
- రేపు సీఎల్పీ భేటీ.. బీజేపీ నిరసన

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావి సువర్ణసౌధలో సోమవారం ప్రారంభం కానున్నాయి. విధానసౌధ ఉద్యోగులు వారం కిందటే బెళగావికి చేరుకున్నారు. అన్నిశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, పోలీసు ఉన్నతాధికారులు శనివారం రాత్రికి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచే ఎమ్మెల్యేలు, మంత్రుల రాక ప్రారంభమైంది. రాత్రి పొద్దుపోయేసరికి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, విధానపరిషత్ సభ్యులు బెళగావికి చేరారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీల ఉమ్మడి సభ్యులు వ్యూహం సిద్ధం చేశారు. కానీ అన్నదాతల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ బీజేపీ 9న సువర్ణసౌధ ముట్టడికి సిద్ధమైంది. చెరకు రైతుల సమస్య, మొక్కజొన్న ధరలు తగ్గడం, అతివృష్టికి పరిహారం లభించకపోవడంతోపాటు పలు సమస్యలపై పోరాటం చేయదలిచారు. ప్రధానంగా శాసనసభ వర్షాకాల సమావేశాలు జరిగి మూడు నెలలు అవుతోంది. ఈలోగా భారీగా డ్రగ్స్ పట్టుబడడం, జైళ్లలో యథేచ్ఛగా ఖైదీలు మొబైల్ ఫోన్లు వాడుతున్న వైనంపై శాసనసభలో ప్రతిపక్షాలు గట్టిగా నిలదీసేందుకు సిద్ధమయ్యాయి. ఢిల్లీలో బాంబుపేలుడు కేసు దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ అధికారులు పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఉగ్రవాదులను విచారించారు. ఇక్కడ ఉగ్రవాది కొన్నిరోజులుగా మొబైల్ ఫోన్ వాడుతున్న విషయం బహిరంగమైంది. ఓ ఉగ్రవాది నేరుగా జైలునుంచి ఫోన్‌లో మాట్లాడుతున్నాడంటే ఎటువంటి కుట్రలు, బెదరింపులకు పాల్పడ్డాడో విదేశీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలపైనా ప్రశ్నించేందుకు సిద్ధమవుతున్నారు. గడిచిన వారం రోజులుగా బీజేపీ సభ్యులు పలు అంశాలపై సభ్యులకు మార్గదర్శకాలు చేస్తున్నారు.



విద్యుత్ కాంతులతో సువర్ణసౌధ

సువర్ణసౌధ ముట్టడికి బీజేపీ వ్యూహం

15-20వేలమంది రైతులతో మంగళవారం సువర్ణసౌధను ముట్టడించాలని బీజేపీ నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఉత్తర కర్ణాటక బీజేపీ, జేడీఎస్ ప్రజాప్రతినిధులతోపాటు రైతుసంఘాలతో తరచూ సభలు నిర్వహిస్తున్నారు. శాసనసభలో రాష్ట్రంలో తీవ్రమైన సమస్యలపై నిలదీయాలని నిర్ణయించారు. జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కుమారస్వామి, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రల సారథ్యంలో ఎమ్మెల్యేల ప్రత్యేక సమావేశం జరిగింది. ప్రధానంగా ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చించేందుకు ఎక్కువ సమయం ఇవ్వాలని ప్రతిపక్షాలు పట్టుదలతో ఉన్నాయి. సాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదని సభలో ఆందోళన చేయదలిచారు. రాష్ట్రంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి కాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తుండడంపై నిరసన చేయదలిచారు. సీఎం సిద్దరామయ్య కొనుగోలు కేంద్రాల ద్వారా 5లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలుకు ఆదేశించారని, అంతకు పదింతలు దిగుబడి వచ్చిందని, ఏ రైతు నుంచి కొనుగోలు చేస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. కంది, ఉద్దులు, వరి కొనుగోళ్ల కేంద్రాల జాప్యంపైనా ప్రస్తావించదలిచారు. తుంగభద్ర జలాశయం క్రస్ట్‌గేట్‌ల అమరిక జాప్యంపైనా సభలో ప్రస్తావించాలని తీర్మానించారు. రెండో పంట సాగు చేయకలేకపోవడానికి గేట్ల అమరిక జాప్యమే కారణమని, అక్కడి రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేయదలిచారు.

- నాయకత్వ మార్పు విషయంలో అధికార పార్టీలో తలెత్తిన గందరగోళం విషయానికి సంబంధించి ప్రభుత్వంపై అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు భావించాయి. ఇందుకోసం 2 సభలు నిర్వహించారు. కానీ అవిశ్వాస అంశంవైపు వెళ్తే ప్రతిపక్షాలు కేవలం కొన్ని సమస్యలనే టార్గెట్ చేయాల్సి ఉంటుందని, అది ఎక్కువ సమయానికి దారి తీస్తుందని భావించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న తరుణంలో విభేదాలు ఉండరాదనే అధిష్ఠానం వ్యూహాత్మకంగా వ్యవహరించి సీఎం, డీసీఎంలకు బ్రేక్‌-ఫాస్ట్ విందుల ద్వారా మేమిద్దరం కలిసే ఉన్నామనే సంకేతం ఇచ్చారు. దీంతో శాసనసభలోనూ ఇద్దరు నేతలు కలసి ఉండేలా వ్యవహరించాలని అధిష్ఠానం ఆదేశించింది.

ముఖ్యమంత్రికి విజయేంద్ర సవాళ్లు

అవినీతి ఆరోపణలకు దర్యాప్తు సంస్థల ద్వారా కాకుండా ప్రభుత్వమే క్లీన్ చిట్ పొందడం సమంజసమేనా..? వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందని స్వయంగా శాసనసభలో సీఎం అంగీకరించారు. అవినీతి మొత్తం వసూలు చేశారా..? శిక్షలు పడ్డాయా..? అంటూ ప్రశ్నించారు. ముడాలో అవినీతి జరగలేదని ప్రకటించిన ముఖ్యమంత్రి భార్యకు దక్కిన 14 ఇంటి స్థలాలను ఎందుకు వాపసు చేశారని ఇది కోట్లాది రూపాయల అవినీతి కాదా అంటూ ప్రశ్నించారు. అవినీతి రహిత పాలన ఏ విధంగా చెబుతారంటూ ప్రశ్నించారు.

మంగళవారం సీఎల్పీ సభ..

కాంగ్రెస్ లెజిస్లేచర్ సభ మంగళవారం నిర్వహించనున్నారు. శాసనసభలో ప్రతిపక్షాలు ప్రస్తావించే అంశాలపై ఎలా మాట్లాడాలని, సమిష్టిగా ముందుకెళ్దామని, సభ్యులకు సీఎం, డీసీఎంలు మార్గదర్శకం చేయనున్నారు. సీఎల్పీలో రాజకీయ అంశాలు ప్రస్తావించరాదని ముందుగానే తీర్మానించారు. కేవలం శాసనసభ, పరిషత్‌లలో సమిష్టిగా ప్రతిపక్షాల వ్యూహాలను ఎదుర్కొనడం, ఏ అంశాలను ప్రతిపక్షాలు ప్రస్తావిస్తారో... వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించదలిచారు.

ఉత్తరలో వైద్యం.. మహాభారం..

ఉత్తర కర్ణాటకలో వైద్యం భారంగా మారింది. ఇక్కడ జబ్బులు వస్తే హుటాహుటిన మహారాష్ట్రకు వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ఉత్తరకన్నడ జిల్లాలో ఇప్పటికీ అటవీప్రాంతంలో నివసించేవారు రోడ్డు లేక రోగులను డోలీలో తీసుకొచ్చే విధానం తరచూ కొనసాగుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి 10వేల మందికి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలి. కానీ ఉత్తర కర్ణాటక జిల్లాలు బీదర్, బళ్ళారి, కలబురగి, యాదగిరి, కొప్పళ, బెళగావి, హావేరి, ధారవాడ జిల్లాల్లో 25-35వేల మందికి ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంది. ఇదే దక్షిణ కర్ణాటకలో 700మంది జనాభాకు ఒక వైద్యుడు ఉంటే ఉత్తర కర్ణాటక జిల్లాలో అంతకు రెట్టింపు జనాభాకు ఒకరు ఉన్నారు. ఉత్తర కన్నడ జిల్లాలో లక్ష మందికి కేవలం 100లోపు పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని నేషనల్ హెల్త్ మిషన్ నివేదికలో ప్రకటించింది. జయదేవ తరహా హృద్రోగ ఆసుపత్రి, కిద్వాయ్ తరహా క్యాన్సర్ ఆసుపత్రులు ఉత్తర కర్ణాటకలో ఏర్పాటు చేయాలని, జిల్లా ఆసుపత్రులలో 24/7 సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవల ఆసుపత్రులను తీర్చాలని, కనీసం 20వేలమందికి ఒక పీహెచ్‌సీ అందుబాటులోకి తేవాలని, వందశాతం మందులు అందుబాటులో ఉండేలా చూడాలనే డిమాండ్ ఉంది.

పోలీసు వలయంలో సువర్ణసౌధ

శాసనసభ శీతాకాల సమావేశాలు జరిగే సువర్ణసౌధ పూర్తిగా పోలీసు వలయంగా మారిపోయింది. మరికొన్ని గంటల్లోనే శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. బెళగావి కలాపాలు అంటే ప్రతి ఏటా ధర్నాలు ప్రజా పోరాటాలతోపాటు మహారాష్ట్ర ఏకీకరణ సమితి నిరసనలతో హోరెత్తుతుంది. మరోవైపు ఢిల్లీలో కారుబాంబు పేలుడు సంఘటనతో కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగం హెచ్చరించింది. దీంతో సువర్ణసౌధ చుట్టూ ఏడుఅంచెల బందోబస్తు ఏర్పాటు చేశారు. బెళగావి నగర పోలీస్ కమిషనర్ భూషణ్ బోరసా నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. 35 కేఎస్ఆర్పీ, 10 డీఏఆర్ బెటాలియన్‌లు, 1 బీడీడీఎస్ బెటాలియన్, 8 అత్యవసర బెటాలియన్‌లు, ఒక గరుడ ఫోర్స్, 16 విధ్వంస నియంత్రణ దళాలతోపాటు 3,820మంది పోలీసు సిబ్బంది, 500మంది హోంగార్డులు, 146 మంది సీనియర్ పోలీసు అధికారులు, 6మంది ఎస్పీలు బందోబస్తులో పాల్గొంటారు.





బెళగావిలో సీఎం సిద్దరామయ్యకు స్వాగతం



సువర్ణసౌధలో సమావేశాలకు ఏర్పాట్లు



సీసీ కెమెరాల నిఘా



పూలచెట్ల వద్ద స్వచ్ఛతా సిబ్బంది సేవలు




విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న డాక్టర్ కామినిరావు

మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలి

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలని పద్మశ్రీ గ్రహీత డాక్టర్ కామినిరావు అన్నారు. మెడ్‌లైన్ అకడమిక్స్ తొలి స్నాతకోత్సవం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. కామినిరావు మాట్లాడుతూ ఫెర్టిలిటీ నైపుణ్యతలో మెడ్‌లైన్ అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. 50ఏళ్లుగా క్లినికల్ సేవలలో కొనసాగుతున్నట్టు తెలిపారు. 2లక్షలమంది దంపతులను తల్లిదండ్రులుగా చేశామని, 1.20 లక్షలమంది పిల్లలు జన్మించేందుకు కేంద్రం పనిచేసిందన్నారు. గౌరవ అతిథి రేడియాలజీ విభాగం నిపుణులు బాలకృష్ణశెట్టి మాట్లాడుతూ కామినిరావు వైద్యసేవల ద్వారా ఎంతో పేరు పొందారని, ఆమె కోడలు మెడ్‌లైన్ అకడమిక్స్, కేఆర్ ఆసుపత్రుల డైరెక్టర్‌గా పూజాసిద్ధార్థరావు, వైద్యరంగంలో మరో రెండు అడుగులు ముందుకేశారన్నారు. మెడ్‌లైన్ ఇషా డయాగ్నస్టిక్స్ రేడియాలజీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు.

ముగిసిన సాహిత్య ఉత్సవం



విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేంద్రభాగంలో గల ఫ్రీడంపార్కులో ఏర్పాటైన బెంగళూరు సాహిత్య ఉత్సవం 14వ ఎడిషన్ శని, ఆదివారాలలో జరిగింది. దేశవ్యాప్తంగా ప్రముఖ రచయితలు, ప్రసంగికులు పాల్గొన్నారు. 4 వేదికలపై చర్చాగోష్ఠులు సాగాయి. ఇతిహాసం, కృత్రిమ మేధస్సు, సామాజిక అభివృద్ధి, లింగత్వ, పాప్ సంస్కృతి, న్యూస్ అండ్ మీడియా, కళలు, సంస్కృతి, సినిమా, ఆహార పరంపర, భాష, అనువాదాలు, క్రీడలు, తదితర అంశాలపై ప్రసంగాలు సాగాయి. తొలిరోజు చర్చాగోష్ఠులలో బుకర్ ప్రైజ్ విజేత బానుముస్తాక్ పాల్గొన్నారు. ఉత్సవం సంస్థాపకబృందం సభ్యుడు వీ రవిచందర్ మాట్లాడుతూ రెండురోజుల కార్యక్రమంలో నవలా రచయితలు, కథా రచయితలు అంజుమ్ హసన్, అనురాధరాయ్, ఐశ్వర్య ఝా, కృపా జీఈ, రాహుల్ భట్టాచార్య తదితరులు ప్రసంగించారన్నారు. వివిధ విభాగాల కార్యక్రమాల విజేతలను ఆత్మీయంగా సత్కరించారు.

ఒకరిద్దరు పిల్లలనే కనండి: సీఎం



వివాహ వేడుకలో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య, వేదికపై నూతన వధూవరులతో డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు

బెంగళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కొత్తగా పెళ్లైనవారు ఒకరిద్దరు పిల్లలను కనాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ధారవాడ జిల్లా నవలగుందలో ఎమ్మెల్యే కోనరెడ్డి కుమారుడు నవీన్‌కుమార్, సహన వివాహ రిసెప్షన్ వేడుకలు జరిగాయి. ఇదే సందర్భంగా 75మందికి సామూహిక వివాహాలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ దేశ జనాభా పెరిగిందని, కుటుంబ నియంత్రణ ఉండాలన్నారు. కులాంతర వివాహాలు పెరగాలని, తద్వారా కులాల పద్ధతి, అస్పృశ్యత నిర్మూలన అవుతుందన్నారు. మంత్రులు సంతోష్‌లాడ్, కృష్ణబైరేగౌడ, మహదేవప్ప, ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య పాల్గొన్నారు.

తుంగభద్ర ఆనకట్ట క్రస్ట్‌గేట్ల ఏర్పాటుకు సన్నాహాలు



క్రేన్ సాయంతో క్రస్ట్‌గేట్లను అమరుస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్ట వద్ద పాత క్రస్ట్‌గేట్లను తొలగించే పని ఆదివారం కొంత ఊపందుకుంది. 18వ గేటులోని కొంత భాగాన్ని కత్తిరించి క్రేన్‌తో తొలగించారు. ఆనకట్టలో నీటి మట్టం ప్రస్తుతం 1,621.46 అడుగులు, 18వగేటులో ఒక భాగం నీటి మట్టానికి 10అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉంది. ప్రారంభంలో అదే గేటులోని ఒక భాగాన్ని కత్తిరించి తొలగించారు. ప్రస్తుతం ఆనకట్ట మధ్యలో క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. అలాగే ఆనకట్ట కుడి వైపు ఉన్న గేట్లను కత్తిరించడం, తొలగించడం తదితర పనులు కూడా దశలవారీగా జరుగుతున్నాయి. డిసెంబరు 3వవారం నాటికి కొన్ని గేట్లను క్లియర్ చేయవచ్చని భావిస్తున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు.

డ్రగ్స్ రహిత కర్ణాటక లక్ష్యం

- రెండేళ్లలో 300 కోట్ల మాదకద్రవ్యాల పట్టివేత
- వింటేజ్ కార్ల ర్యాలీ ప్రారంభోత్సవంలో హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత కర్ణాటక మా లక్ష్యమని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. ఆదివారం విధానసౌధ వద్ద వింటేజ్‌కార్ల ర్యాలీ ద్వారా డ్రగ్స్ నియంత్రణ చైతన్యాన్ని కలిగించారు. బెంగళూరు సిటీ పోలీసులు, ఫెడరేషన్ ఆఫ్ హిస్టారికల్ వెహికల్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో పాల్‌జాన్ రిసార్టు సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత వింటేజ్ కార్ల ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ నినాదం ప్రారంభించినప్పుడే డ్రగ్స్ రహితగా మారిందనే అర్థం కాదన్నారు. ప్రభుత్వం, పోలీసులు నిరంతరంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఏడాదిలో రూ.300కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశామన్నారు. వేలాదిమందిని అరెస్టు చేశామన్నారు. ఇంకా కొందరు జైళ్లలోనే ఉన్నారన్నారు. విద్యకోసం ఆఫ్రికాదేశాలనుంచే వచ్చే కొందరు ఇదే వ్యాపారంగా పెట్టుకున్నారన్నారు. డ్రగ్ పెడ్లర్‌లు ఎంత దిగజారారంటే విద్యార్థులకు చాకొలేట్ రూపంలో డ్రగ్స్ ఇచ్చి బానిసలు చేసే కుట్ర పన్నారన్నారు. ప్రజలు సహకరించాలని, విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు బానిస కారాదని కోరారు. డీజీపీ ఎంఏ సలీం, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్, ఫెడరేషన్ ఆఫ్ హిస్టారికల్ వెహికల్ ప్రతినిధి డాక్టర్ రవిప్రకాశ్, నటుడు మదన్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు. విధానసౌధ వద్ద కార్ల ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



వింటేజ్ కార్ల ర్యాలీలో హోం మంత్రి పరమేశ్వర్, డీజీపీ, నగర పోలీస్ కమిషనర్






ర్యాలీలో ఆకట్టుకున్న కార్లు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.46	1629.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	526	4,531
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,194	5,164
నీటి నిల్వ (టీఎంసీలు)	65.52	92.24

నేడు కార్తీక దీపోత్సవం



అలంకరణలోబసవేశ్వరస్వామి

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాలో ప్రసిద్ధిచెందిన కొట్టూరు బసవేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. భక్తులు కాలినడకతో కొట్టూరు చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మొక్కుల్ని సమర్పించుకుంటారని తెలిపారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ



అదనపు తరగతి గదుల నిర్మాణపనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు భూమిపూజ చేశారు. ఆదివారం పట్టణం 6వ వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణ పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కల్యాణ కర్ణాటక అభివృద్ధి పథకం నిధుల కింద పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, నాయకులు గణేష్, అప్పాజీ, పవన్ కుమార్ దేశాయ్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు



డ్రైవర్లకు పరీక్ష చేస్తున్న వైద్యుడు శ్రీనివాస్

బళ్లారిరూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కంటోన్మెంట్ ఓపీడీ ఆస్పత్రి సమీపంలో ఉన్న అనుష్క ఆస్పత్రి వైద్యులు కీర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. డ్రైవర్లతో పాటు కార్మికులు పాల్గొని కాళ్లు, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, బీపీ, మధుమేహ పరీక్షలు చేయించుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

సందులో ఇరుక్కుని ఎద్దు మృతి



ఎద్దుకళేబరం

కంప్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని దేవలాపురం గ్రామంలో దళిత కాలనీలో రాముడు ఇంటి వద్ద ఓణిలో ఎద్దు ఇరుక్కుపోయి మృతి చెందింది. దేవలాపురం గ్రామంలో రాత్రివేళలో కుక్కలు ఎద్దును తరుముకుని రావడంతో ఒక్కసారి పక్కనే ఉన్న ఓణిలోకి ఎగిరి బోర్లపడటంతో వెనక్కు రాలేక ఎద్దు మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఉదయం ఎద్దుపొట్ట లావుకావడంతో మరింత కష్టంతో ఎద్దు రెండు వైపులా ఉన్న గోడలను తొలగించి బయటకు తీసినట్లు తెలిపారు. మృతి చెందిన ఎద్దు ఎవరిదని తెలియలేదు.

కులవృత్తికి వన్నెతెస్తున్న దివ్యాంగుడు

- వైకల్యాన్ని జయించిన పుండలిక్
- పలువురికి ఉపాధి కల్పిస్తున్న వైనం




మట్టితో కళాకృతులు తయారు చేస్తున్న పుండలిక్

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈయన పుట్టుకతోనే దివ్యాంగుడు. కుటుంబం పేదరికంతో సతమతమవుతోంది. అయినా కష్టపడి పోస్టు గ్రాడ్యుయేషన్, బీఈడీ పట్టా పొందాడు. ఉపాధ్యాయుడి ఉద్యోగం వచ్చినా... దానిని కాదనుకుని తన పెద్దల కులవృత్తినే స్వీకరించి కుండల తయారీకి ఆధునిక స్పర్శను ఇవ్వడం ద్వారా రూ. లక్షలు ఆర్జిస్తున్నాడు. ఆయనతో పాటు మరో 25మందికిపైగా ఉపాధి కల్పించడం ద్వారా ఆయన నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడు పుండలిక్ కుంబార అనే యువకుడు. ఆయన సాధించిన విజయాలకు కేంద్ర ప్రభుత్వ జాతీయ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు.

● పుండలిక్ ఖానాపూర్ తాలూకాలోని దుక్కరవడి గ్రామానికి చెందినవాడు. తండ్రి మనోహర్, తల్లి విమలాబాయిలకు ఇతను రెండో కుమారుడు. ఇతనికి ఒక సోదరి, ఇద్దరు సోదరులు ఉన్నారు. పుండలిక్ పూర్వీకుల కులవృత్తి కుండలు తయారుచేయడం. ప్రారంభంలో వారు గాడి, హనాటే కుడిక వంటి సంప్రదాయ మట్టి వస్తువులను తయారు చేసేవారు. అది వారి పొట్టకు, బట్టలకు సరిపోయేవి. ఇంట్లో పేదరికం తొలగి పోలేదు. ముఖ్యంగా పుండలిక్ పుట్టుకతోనే దివ్యాంగుడు. అయినా తల్లితండ్రులు కష్టపడి బీఈడీ వరకు చదివించారు. బీఏ, బీఎడ్‌లతోపాటు కర్ణాటక విశ్వవిద్యాలయంలో ఎంఏ మరాఠీ విభాగంలో పీజీ చేశారు. ఆయన చదువుకు 2020లో ప్రభుత్వ హైస్కూలు ఉపాధ్యాయుడిగా పోస్టు వచ్చింది. అయితే డాక్యుమెంట్ల పరిశీలనకు వెళ్లలేదు. తాను ఉద్యోగ నిమిత్తం వెళ్ళిపోతే తమ పూర్వీకుల కులవృత్తి, గ్రామీణ కళ నశించి పోతుందనే ఉద్దేశ్యంతో కులవృత్తిలోనే జీవనోపాధి వెతుక్కోవాలని నిర్ణయించుకున్నాడు. కేవలం మట్టికుండలు చేస్తే జీవనం కష్టమని భవించి, వాటితో పాటు ఆకర్షణీయమైన మట్టి కళాకృతులు తయారు చేయాలని నిర్ణయించుకుని వాటి ద్వారా ఆదాయం పొంది విజయం సాధించాడు.

పుండలిక్ మొదట్లో ఖానాపుర కుంబరి కేంద్రంలో శిక్షణ పొందాడు. అనంతరం బెంగళూరులోని క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ కర్ణాటక కేంద్రంలో యంత్రాల ద్వారా వస్తువులు తయారీ చేయడం, టెరాకోట్, మోరల్ ఆర్ట్, చేతులతో మట్టి కళాకృతులను సులభంగా తయారు చేసే నైపుణ్యాన్ని అభ్యసించాడు. ప్రారంభంలో ఐదుగురితో మట్టితో కళాకృతులు తయారు చేసే పనిని ప్రారంభించాడు. అనంతరం 25మందికి పైగా ఉపాధి కల్పించి ఒక్కొక్కరికి రూ.10వేల వరకు వేతనం ఇస్తున్నాడు. వివిధ గృహోపయోగ వస్తువులు, అలంకారిక వస్తువులు, మూర్తులు, ప్రతిమలు, ఆటవస్తువులు, పూజా సామగ్రి... ఇలా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అవసరమయ్యే వస్తువులు మట్టిద్వారానే తయారు చేయడం విశేషం. పుండలిక్ తయారు చేసిన వస్తువులు రూ.15లు నుంచి రూ.20వేల వరకు ధర పలుకుతుండడం విశేషం.





పుండలిక్ చేతిలో రూపుదిద్దుకున్న గ్రామీణ మహిళ, నరసింహస్వామి కళాకృతులు

వివిధ దేశాలకు ఎగమతి

పోలియో కారణంగా పుట్టుకతోనే దివ్యాంగుడైన పుండలిక్ విద్యాభ్యాసం తరువాత ఇంట్లో ఊరికే కూర్చోక తనలో దాగివున్న కళను పెట్టుబడిగా పెట్టి మట్టితో కళాకృతులు తయారుచేసి వాటితోనే వ్యాపారం చేస్తూ రాణిస్తున్నాడు. పుండలీక్ తయారు చేసిన కళాకృతులు కర్ణాటకతో పాటు గోవా, మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, కేరళలతో పాటు దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడం విశేషం. నాలుగేళ్ళుగా అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లాండ్ దేశాలకు కొరియార్ ద్వారా కళాకృతులు ఎగుమతి చేస్తున్నారు.

పలువురికి ఉపాధి కల్పించడమే లక్ష్యం - పుండలిక్ కుంబార



మొదట్లో తినడానికి తిండిలేని రోజులూ ఉన్నాయి. తల్లితండ్రులు కష్టపడి విద్యాబుద్ధులు నేర్పించారు. ప్రస్తుతం ఆర్థికంగా ఎదగడంతో ఇతరులకు ఉపాధి కల్పిస్తుండడం గర్వంగా ఉంది. అవార్డులకు ఆశపడి ఈ వృత్తిని చేయడం లేదు. కుంబార సమాజాన్ని మరింత ఆర్థికంగా బలపరచడమే లక్ష్యం. ఆధునిక పోకడలతో కనుమరుగై పోతున్న కుంబార కళకు మరింత వన్నెతెచ్చి దేశవ్యాప్తంగా వ్యాపారం విస్తరించాలి. కనీసం 500మందికి ఉపాధి కల్పించాలని ధేయంగా పెట్టుకున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తే ప్రధాన మోదీ ప్రవేశపెట్టిన మేక్ ఇన్ ఇండియా కల సాకారం చేయడానికి కృషి చేస్తా.

నాసిరకంగా సీసీ రోడ్ల పనులు

- ఏడాదిలోపే ఏర్పడ్డ పగుళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముష్టిగట్టి ప్రజలు



ముష్టిగట్టి వద్ద పగుళ్లు వచ్చిన సీసీ రోడ్డు

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సీసీ రోడ్లు నాసిరకం పనులతో మూన్నాళ్లకే పగుళ్లు ఏర్పడుతున్నాయి. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నాసిరకం పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 2023-24 సంవత్సరంలో కురుగోడు సమీపంలోని ముష్టిగట్టి గ్రామం వద్ద వేసిన సీసీ రోడ్డు రెండు నెలలకే పగుళ్లు ఏర్పడ్డాయి. కేకేఆర్‌డీబీ మైక్రో ప్రాజెక్టు కింద రూ.2.5 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. కేవలం ఒక సంవత్సరం వ్యవధిలోనే సీసీ రోడ్డు దెబ్బతినిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపై కొండల్లో ఉన్న క్రషర్‌కు ఎక్కువగా పెద్ద వాహనాలు తిరుగుతుంటాయని, వేసిన కొన్ని నెలలకే రోడ్డు అధ్వానంగా మారిందని మంజునాథ్ అన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వున్న కాలంలోనే వేగంగా భూమి పూజలు చేపడుతూ అభివృద్ధి నియోజకవర్గంలో కనిపిస్తుంది కానీ చేసే పనుల్లో నాణ్యత లేక నిధులు కాంట్రాక్టర్ల పాలవుతున్నాయన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే వెంటనే చర్యలు చేపట్టి కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో చేర్చాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పాఠశాల గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, రైతు రోడ్లు, ప్రధాన రోడ్లు మరెన్నో పనులు చేపట్టామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి నియోజకవర్గంలో ఆ కాంట్రాక్టర్‌లకు పనులు అప్పగించమన్నారు.

పెరుగుతున్న కంది ధర

- క్వింటాలు రూ.6 వేలు నుంచి రూ.7 వేలకు..
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కంది ధర రోజు రోజుకు పెరుగుతోంది. ఇది రైతులకు ఆనందాన్ని కలిగిస్తున్నా వినియోగదారులకు భారంగా మారుతోంది. ఈ ప్రాంత రైతులు ముఖ్యంగా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో బహిరంగ ప్రదేశాలలో పండించిన కంది బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రమిస్తున్నారు. 15 రోజుల క్రితం క్వింటాలుకు రూ.6000 ఉన్నధర ప్రస్తుతం రూ.7వేలు దాటింది. వర్షాధార పరిస్థితుల్లో పెద్దగా ఖర్చు లేకుండా పండించే ఈ పంట ఎకరానికి కనీసం 3 నుంచి 6 క్వింటాళ్ల వస్తుంది. ఈసారి ఈపంట మా దృష్టిని ఆకర్షించిందని రైతులు చెపుతున్నారు. వ్యాపారి రామచంద్ర మాట్లాడుతూ ఈ పంట ఈసారి రైతులకు సహాయపడిందని అన్నారు. రైతులు వేరుశనగను నిరంతరం పండించేవారని, సకాలంలో వర్షం రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తక్కువ వర్షం కురిసినా దిగుబడి ఇచ్చే కంది సాగుపై రైతులకు ఈసారి లాభాలు తెచ్చే అవకాశం ఉందని అన్నారు.



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కంది



స్వామి, అమ్మవార్లకు నిశ్చితార్థం చేస్తున్న పురోహితులు

ముగిసిన ఫలపూజలు

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపి పుణ్యక్షేత్రం కోదండ రామాలయంలో శనివారం రాత్రితో పూజలు ముగిశాయి. 4 నుంచి 7వ తేదీ వరకు హంపి పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వాములు సుధాకర్ శర్మ స్వాములు ఇతర పురోహితుల ఆధ్వర్యంలో విరుపాక్షస్వామి, పార్వతిలకు వివాహ నిశ్చితార్థం చేపట్టారు. పౌర్ణమి రోజు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు పురోహితులు తెలిపారు. అనంతరం స్వామి అమ్మ వార్లను దెబ్బలు కోనేరులో భాజభజంత్రీల మధ్య నిశ్చితార్థం చేశారు. రాష్ట్ర ఇతర ప్రాంతాలనుంచి ఫలపూజ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రాత్రివేళలో జ్యోతులు వెలిగిస్తూ పూజ జరుపుకున్నారు. పలపూజ కార్యక్రమానికి కర్ణాటక ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న పంచాయతీ అభివృద్ధి అధికారి వీరేష్

సిరుగుప్ప, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి సభ్యుల సహకారం అత్యవసరమని పంచాయతీ అభివృద్ధి అధికారి వీరేష్ అన్నారు. సిరుగుప్ప తాలుకాలోని ముద్దటనూరు గ్రామంలో సామాన్య సభ నిర్వహించారు. సభలో గ్రామాల అభివృద్ధికి ప్రజల సహకారంతో పాటు సభ్యుల సహకారం అవసరమని అన్నారు. గ్రామాల్లో సమస్యలు వుంటే అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. తాగునీరు, డ్రైనేజీలు, మరుగు దొడ్లు తదితర సమస్యలు తక్షణమే పంచాయతీకి తెలపాలన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సోమశేఖరప్ప, ఉపాధ్యక్షులు మీనాక్షి, సభ్యులు పాల్గొన్నారు.

10న చలో బెళగావి

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం 10వ తేదీన చలో బెళగావి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.నాగలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు 2008 నుంచి కర్ణాటక ప్రభుత్వ ఆరోగ్య శాఖలో చురుకుగా సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం 42వేల కంటే ఎక్కువగా ఉన్నారన్నారు. 18సంవత్సరాలుగా గ్రామీణ, పట్టణ కుటుంబాల తల్లులు, పిల్లలకు సాధారణ ప్రజలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య సేవలందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రాణాంతక మహమ్మారి కరోనా సమయంలో అందించిన ప్రత్యేకమైన సేవను ఎవరూ మరిచిపోరన్నారు. 17సంవత్సరాలు క్రితం ఈసేవకు నియమించిన కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కార్యకలాపాల ఆధారిత ప్రోత్సకాలను అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే నేటి వరకు జీతాలు పెంచలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకంతో సహా రూ.15000 జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆశా ఫెసిలిటేటర్లకు తగిన జీతాలతో కొనసాగించాలన్నారు. పదవీవిరమణ చేసిన ఆశా వర్కర్లకు పశ్చిమ బెంగాల్ తరహాలో పెన్షన్ ఇవ్వాలన్నారు. పట్టణ ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.2000 అదనంగా ఇవ్వాలన్నారు. అనంతరం చలో బెళగావి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు ఎ.శాంత, బళ్లారి నగర అధ్యక్షులు రేష్మా, ప్రముఖులు ఖైరున్నీబి, శివకుమారి, రేణాకా, శ్రీదేవి పాల్గొన్నారు.

రీకాంబినేషన్ టెక్నాలజీ తప్పనిసరి

● డాక్టర్ ఉమారెడ్డి

బళ్లారి సిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రోటీన్లను రీకాంబినేషన్ టెక్నాలజీ తప్పనిసరిగా చేయాలని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ జీవశాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి.ఉమారెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని సరళాదేవి కళాశాల ఆడిటోరియంలో శనివారం జీవశాస్త్ర విభాగం నిర్వహించిన మాలిక్యులర్ బయాలజీ టెక్నిక్స్ అనే అంశంపై ఆమె ప్రసంగించారు. కణాల సూక్ష్మ విధులను అన్వేషించడానికి ఈ పద్ధతి చాలా ముఖ్యమైందన్నారు. ఇది ప్రోటీన్లను అధ్యయనం చేయడానికి ఉపయోగించే అత్యాధునిక పద్ధతని అన్నారు. విద్యార్థుల్లో పరిశోధనా స్ఫూర్తిని పెంపొందించి, ఉన్నత విద్యకు సిద్ధమయ్యేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని జీవశాస్త్ర విభాగాధిపతి హనుమంత నాయక్ అన్నారు. కార్యక్రమంలో అతిథి లెక్చరర్లు మీనా, హర్షిత, ఆశా, షాహిన్, అరుంధతి పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ నీటికి హారతి



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

గుడిబండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న కృష్ణాజలాలు గుడిబండ మండలానికి చేరడంతో రైతులు, టీడీపీ నాయకులు జలహారతి ఇచ్చి పూజలు చేశారు. ఆదివారం గుడి బండ మండలం సింగేపల్లి గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువలో అమరాపురం చెరువుకు వెళ్తున్న కృష్ణమ్మ నీటికి జలహారతి ఇచ్చారు. కృష్ణ జలాలను తీసుకొచ్చిన ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిలకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, టీడీపీ ప్రదాన కార్యదర్శి శ్రీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి చిత్రశేఖర్ యాదవ్, బీసీసెల్ నాయకుడు జయరామప్ప, రైతులు పాల్గొన్నారు.

13న జిల్లాస్థాయి మెగా వాలీబాల్ టోర్నీ

అగళి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిసెంబరు 13, 14 తేదీల్లో వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడాకారులు కర్రియన్న, యశ్వంత్, మంజునాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.33,333, రెండో బహుమతి 22,222, మూడో బహుమతి 11,111, నాలుగో బహుమతి 5,555 ఇవ్వడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 8688559036, 7799664868ను సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

పెనుకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ముంబైలోని భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ సమాధి చైత్య భూమిని దర్శించి నివాళులు అర్పించారు. బడుగు బలహీనవర్గాలకోసం అలుపెరుగని పోరాటం చేస్తూ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులు కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింహ, ఈశ్వర్, హనుమంతు, కదిరప్ప, సురేష్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

తిరుప్పర కుండ్రం ఘటనకు వ్యతిరేకంగా నిరసన

హోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై తరహాలో దీపోత్సవం చేయడానికి మధురై జిల్లా తిరుపుర గుండ్రం (తిరుప్పర కుండ్రం) లోని సుబ్రమణ్య స్వామి ఆలయంలో స్థానిక నాయకులు ఈ ఏడాది ప్రయత్నించారు. అయితే దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఇటువంటి ఆచారం ఇక్కడ వద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరు, దేవదాయశాఖ వైఫల్యాన్ని ఖండిస్తూ హిందూ మున్నణి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిరసనకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా హోసూరు రాంనగర్‌లోని అన్నా విగ్రహం వద్ద నిరసన ఆదివారం నిరసన చేపట్టారు. మున్సిపల్ చైర్మెన్ శశికుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమేశ్ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. నిరసనలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు, పార్టీకి చెందిన జిల్లా నగర యూనియన్ పదాధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కాషాయ జెండాలతో హిందు మున్నణి ఆధ్వర్యంలో నిరసన

స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వండి

● నాన్ తమిళర్ పార్టీ డిమాండ్

హోసూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): హోసూరు నగర వ్యాప్తంగా వందలాది ఫ్యాక్టరీలు, పెద్దసంఖ్యలో దుకాణాలు ఉన్నా యి. వీటివల్ల వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. అయితే ఫ్యాక్టరీలు, సూపర్‌మార్కెట్‌లలో ఉత్తరాదివారికి ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుండడంపై నాన్ తమిళర్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉద్యోగ, ఉపాధి కల్పనలతో స్థానికంగా ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామ్‌తమిళర్ పార్టీ ఆధ్వర్యంలో హోసూరులోని జాతీయ రహదారిపై ఆదివారం నిరసన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి రజిని నాయకత్వం వహించారు. ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. దీంతో అక్కడికి ఏడీఎస్‌పీ శంకర్, డీఎస్‌పీ ఆనందరాజు సిబ్బందితో చేరుకున్నారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.



నాన్ తమిళర్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

తారురోడ్డు పునరుద్ధరణ పనులు ప్రారంభం

హోసూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని తారు రోడ్డు పునరుద్ధరణకు ఎమ్మెల్యే ప్రకాశ్ శ్రీకారం చుట్టారు. హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని హోసూరు పంచాయతీ యూనియన్ పంచాయతీలో పీఎం సీఎస్‌వై పథకం క్రింద దాదాపు రూ.71.56 లక్షలతో బాగలూరు - మాలూరు రహదారి నుంచి బాలిగానపల్లి మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు తారురోడ్డు పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఎంకే పార్టీ జిల్లా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

జీన్ సిబిలస్ (జయంతి)



ఫిన్లాండ్ దేశానికి చెందిన ప్రముఖ వయోలినిస్ట్, మ్యూజిక్ కంపోజర్ జీన్ సిబిలస్ 1865 డిసెంబరు 8న జన్మించారు. రష్యా నుండి స్వాతంత్ర్యం పొందే వేళ కూడా సంగీతంలో జాతీయ స్థాయిలో తనదైన గుర్తింపు సాధించారు. సెవెన్త్ సింఫనీ ప్రదర్శన ఆయన ప్రత్యేకతగా నిలిచింది. 1957 సెప్టెంబరు 20న కన్నుమూయగా దేశ గౌరవాలతో అంత్యక్రియలు జరిపారు. ఫిన్లాండ్ దేశంలో ఆయన పుట్టినరోజును 'డే ఆఫ్ ఫినిష్ మ్యూజిక్'గా ఆచరించారు.

ఉదయ్‌శంకర్ (జయంతి)



పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత నాట్య రూపకర్త ఉదయ్‌శంకర్ చౌదరి 1900 డిసెంబరు 8న రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో జన్మించారు. యూరోపియన్ పద్ధతు లను భారతీయ శాస్త్రీయ నృత్యానికి, గిరిజన నృత్యానికి అనుగుణంగా మార్చడంలో ప్రసిద్ధి చెందారు. 1920, 30 దశకాలలో ఐరోపా, అమెరికాలలో ప్రాచుర్యం కల్పించారు. దేశ ఆధునిక నృత్యానికి మార్గదర్శకుడిగా నిలిచారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ నుంచి జీవితసాఫల్య పురస్కారం, అందుకున్నారు. 1977 సెప్టెంబరు 26న కన్నుమూశారు. ఆయన శతజయంతికి గౌరవంగా 2001లో యునెస్కో కేంద్ర కార్యాలయంలో ప్యారిస్‌లో డ్యాన్సర్లు, కొరియోగ్రాఫర్‌లు ప్రత్యేక ప్రదర్శన ఇచ్చి మాస్టర్‌కు నివాళులు అర్పించారు.

నేదునూరి కృష్ణమూర్తి (వర్ధంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. సంగీతంపై ఆసక్తితో ద్వారం నరసింరావు నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాకపాణిల వద్ద తర్ఫీదు పొందారు. ఆలిండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా రాణించారు. 1951 నుంచి ఐదు దశాబ్దాలకుపైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత కళానిధి పురస్కారం పొందారు. 2014 డిసెంబరు 8న కన్నుమూశారు.

షర్మిలా ఠాగూర్ (పుట్టినరోజు)



హిందీ సినీ రంగంలో పేరొందిన షర్మిలా ఠాగూర్ 1944 డిసెంబరు 8న జన్మించారు. బేగం ఆయేషా సుల్తానాగా గుర్తింపు పొందారు. రెండు జాతీయ పురస్కారాలు, రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ఇండియన్ ఫిల్మ్ సెన్సార్‌బోర్డు అధ్యక్షురాలిగా 2004 నుంచి 2011వరకు వ్యవహరించారు. 2005లో యూనిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. 2013లో పద్మభూషణ్ పురస్కారం పొందారు.

పేదలకు వరం.. సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే పీఏ వీరయ్య

హిందూపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. నియోజకవర్గంలోని 65 మందికి సీఎం సహాయనిధి రూ.33 లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించినవారికి మరికొంతమంది పేదలు, వివిధ అనారోగ్యం, ప్రమాదాల్లో గాయపడి ఆర్థికంగా చితికిపోయిన వారికి ఇలాంటి వారికి సీఎం సహాయనిధి కొండంత బలంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు వెంకటేశ్, హెచ్ఎస్ రాము, శ్రీనివాసులు, అభిలాష్, టీడీపీ జనసేన నాయకులు పాల్గొన్నారు.

● రాగాలతో రోగాలు నయం చేసుకోవచ్చని ఎమ్మెల్యే పీఏ వీరయ్య, ఎంఈఓ గంగప్ప అన్నారు. ఆదివారం ఎంఈఓ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, సంగీత విభావరి జరిగాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి వచ్చిన వివిధ ప్రాంతాల కవులు వారి కవితను వినిపించారు. సంగీత విభావరిలో కళాకారులు నాట్యాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో కనగానపల్లి ఎంఈఓ శ్రీదేవి, మలుగూరు పాఠశాల హెచ్ఎం పద్మావతి, వివిధ ప్రాంతాలకు చెందిన కవులు హాజరయ్యారు.

ఘనంగా కనకదాస జయంతి

హిందూపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సడ్లపల్లిలో కనకదాస జయంతి వైభవంగా జరిగింది. ఆదివారం సడ్లపల్లిలో కురుబ కులానికిచెందిన మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి కనకదాస విగ్రహానికి సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ బాలాజీ, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజి, కౌన్సిలర్ సునీత, మాజీ కౌన్సిలర్లు నారాయణప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** మండల పరిధిలోని తిరుమల దేవరపల్లిలో ఆదివారం ఘనంగా భక్తకనకదాస జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోస్తూ మొక్కులు తీర్చుకున్నారు. కురుబ సంఘం ఆధ్వర్యంలో కనకదాస చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురుషోత్తం, సర్పంచ్ బాలు, చెన్నకేశవ, శివ తదితరులు పాల్గొన్నారు.

● **రొద్దం:** మండల పరిధిలోని గోనిమేకలపల్లిలో భక్త కనకదాస జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు. మహిళలు కళశాలతో ఊరేగింపుగా వెళ్లారు. గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కురుబలు అశ్వర్థ, రవి, రామాంజి, పోతులయ్య, చిన్నమైలారప్ప, జబ్బల మైలారప్ప, అంజినప్ప, మనోహర్, టీడీపీ నాయకులు ఇమాంసాబ్, పోతన్న, మహిళలు పాల్గొన్నారు.



జ్యోతులతో మహిళలు, టీడీపీ నాయకులు

స్థానిక ఎమ్మెల్యేను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు

▸▸ ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనక భవన ప్రారంభం ఈనెల 7న ఖరారైనప్పటికి కోలారు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేశ్ ఈనెల 6న ప్రారంభించి స్థానిక ఎమ్మెల్యేను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం అని ఎమ్మెల్యే సమృద్ధిమంజునాథ్ ప్రశ్నించారు. ఆదివారం తాలూకాలోని కేజీఎఫ్ మెయిన్‌రోడ్డు కగ్గినహళ్ళి గ్రామం వరకు రూ.80లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనకభవన్ నిర్మాణానికి వ్యక్తిగతంగా రూ.25లక్షలు ఇచ్చానని, ఇతరు ఎమ్మెల్యేలు కూడా ఆర్థికసాయం చేశారన్నారు. అయితే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంత గ్రాంటు ఇచ్చారని ప్రశ్నించారు. తాలూకా అభివృద్ధికి మంత్రి నుంచి ఎటువంటి సహకారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వ అమృత మహోత్సవ కార్యక్రమం ముళబాగిలు, శ్రీనివాసపుర తాలూకాలకు రాకుండా చేశారని ఆయన చేసిన సాధన ఇదేనంటూ వ్యంగ్యం చేశారు. కాగా తాలూకా కురుబసంఘం అధ్యక్షులు 20 ఏళ్లుగా సేవలందిస్తున్నారని, కనకభవన్ ప్రారంభం కార్యక్రమ ఆహ్వానపత్రికలో కేవలం కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చి ఇతరులను నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. 2028 కు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికవుతారని జోస్యం చెప్పడం ద్వారా మంత్రి మనఃస్థితి ఏమిటో అర్థం అవుతోందన్నారు. కగ్గినహళ్ళి గేట్ వద్ద హైమాస్ దీపస్థంభాన్ని ఏర్పాటు చేయడంతోపాటు శుద్ధతాగునీటి కేంద్రాన్ని ప్రారంభిస్తామని, గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ను గ్రామ గేట్‌నుంచి విశేషంగా పుష్పాలతో అలంకరించిన టెంపో ద్వారా ఊరేగించి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి, నగరసభ మాజీ అధ్యక్షుడు ఎంఆర్ మురళి, సహకార యూనియన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సమాజ సేవకుడు గొల్లహళ్ళి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత

▸▸ శివశరణ మూర్తి మాదరచన్నయ్యస్వామీజీ



అణ్ణమ్మ, మద్దూరమ్మ దేవతలకు విశేష పూజలు



కుంభాభిషేకంలో ప్రముఖులు

మహదేవపుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, మఠాల సందర్శనతో మానసిక ప్రశాంతత సాధ్యమని శివశరణ మూర్తి మాదరచన్నయ్యస్వామిజీ అభిప్రాయపడ్డారు. ఆలయాలు హరాడి గ్రామంలోని అణ్ణమ్మ, మద్దూరమ్మ దేవాలయ నూతన బింబ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం, ఇతర అన్ని ధార్మిక కార్యక్రమాలు శివశరణ మూర్తి మాదరచన్నయ్యస్వామిజీ మార్గదర్శకంలో అర్చకులు సీతారామ్ పాళ్య బాబు, ఆయన బృందం శాస్త్రోక్తంగా కార్యక్రమాలు సాగాయి. ఈ సందర్భంగా మాదర చన్నయ్యస్వామిజీ మాట్లాడుతూ హరాడిలో 21 సంవత్సరాల తర్వాత గ్రామస్తుల సహకారంతో ఆలయం లోకార్పణ కావడం సంతోషంగా ఉందన్నారు. సనాతన ధర్మంలో ఆలయ నిర్మాణ, ఆరాధన వంటివి పవిత్ర కార్యక్రమాలుగా ఉన్నాయన్నారు. సాంకతిక పరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినా ఆధ్యాత్మికత అవసరం మానవుడికి ఉందన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ, ఆధునీకరణ, నూతన బింబ ప్రతిస్థాపన కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. హరాడి, అయ్యప్పనగర్, తిగర పాళ్య, రాజాపాళ్య, బసవణ్ణనగర్, వైట్‌ఫీల్డ్ తదితర ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. ఆలయాన్ని వైవిధ్యమయ పుష్పాలంకరణ, దీపాలతో అలంకరించారు. హోమాదిహవనాలు విశేష పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ ప్రముఖులు హరాడి పిళ్ళప్ప, హెచ్‌వీ మంజునాథ్, మునికదిరప్ప లే అవుట్ శ్రీనివాస్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదవృత్తి పవిత్రతను కాపాడండి

▸▸ న్యాయాధికారి రామలింగేగౌడ



ప్రసంగిస్తున్న న్యాయాధికారి రామలింగేగౌడ

శిడ్లఘట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజ, ప్రజల ఉన్నతికి మార్గదర్శకం చేసే పవిత్రమైన న్యాయవాద వృత్తి పవిత్రతను కాపాడాలని జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయాధికారి రామలింగేగౌడ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు సముదాయంలో తాలూకా న్యాయవాదులసంఘం ఆధ్వర్యంలో లాయర్స్‌డేను ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీర్లు ఆనకట్టలు, ఇళ్లు, ఇతర భవనాలు నిర్మిస్తారని అయితే న్యాయవాదులు సమాజంలోని అసమానతను తొలగించేలా కృషి చేసి వారి జీవనానికి న్యాయం చేయాలన్నారు. ప్రధాన సివిల్ న్యాయాధికారి మొహ్మద్ రోషన్ షా మాట్లాడుతూ న్యాయవాదులు తమ కక్షిదారులకు న్యాయం చేసేందుకు ఎంతో అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. సీనియర్ల సలహా సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవల ప్రాధికార మెంబర్ సెక్రటరీ శిల్ప, ప్రధాన సివిల్ న్యాయాధికారి సుకన్య, సీనియర్ న్యాయవాది ఎం పాపిరెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమతా సైనిక దళలోకి పలువురి చేరిక



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్ళి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన సమతాసైనికదళ (ఎస్ఎస్‌డీ)లోకి బొమ్మనహళ్ళి పరిధి లోని మంగమ్మనపాళ్య, బండెపాళ్య, హొసపాళ్య ప్రాంతాలకు చెందిన 50మందికి పైగా చేరినట్టు సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. నూతన కార్యకర్తలను కండువాలతో ఆత్మీయంగా స్వాగతించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగమ్మనపాళ్యలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్‌డీ శాఖలు ఉన్నాయన్నారు. దళితులు, ఇతర వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘం పోరాటం చేస్తోందన్నారు. దిలీప్‌రెడ్డి, సంతోష్, రాజణ్ణ, బాషా, సలీం, పెద్దసంఖ్యలో సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

తాలూకాస్థాయి మహిళా జ్ఞానవికాస



వేదికపై ప్రముఖులు

దొమ్మసంద్ర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనె ట్రస్టు ఆధ్వర్యంలో ఆనేకల్ తాలూకాస్థాయి చర్చాగోష్ఠి, మహిళా జ్ఞాన వికాస కార్యక్రమాలు జరిగాయి. జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ చిన్నప్ప వై చిక్కహెగడె ప్రారంభించి మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చాక పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాలలో రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల రంగాలలో కూడా తమ ప్రతిభను చాటుతున్నారన్నారు. పురుష ప్రాధాన్య సమాజంలో నేటికీ మహిళలు, బాలికలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు చోటు చేసుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. కాగా ఆనేకల్ తాలూకాలో 8 చెరువులను ధర్మస్థళ సంస్థ పునరుద్ధరించిందన్నారు. సంఘం ద్వారా స్వసహాయ సంఘాలకు రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి కోట్ల రూపాయలకుపైగా రుణాలు పంపిణీ చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించిందన్నారు. 22వేల మందికి ప్రతినెలా వెయ్యి రూపాయల పింఛను ఇస్తోందన్నారు. 600కుపైగా శుద్ధతాగునీటి కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆనేకల్ తాలూకాలోని 18 పాఠశాలలకు పలువురు ఉపాధ్యాయులను నియమించారన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో పురసభ మాజీ అధ్యక్షులు సుధా నిరంజన్, రచయిత్రి విశాల ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి అన్నదమ్ముల మృతి

- అన్నను కాపాడేందుకు వెళ్లి తమ్ముడు..
- కళ్యాణదుర్గంలో విషాదం



తలారి నరేంద్ర, చరణ్ (ఫైల్)

బ్రహ్మసముద్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన తలారి వెంకటేశులు అనే వ్యక్తి పాలవెంకటాపురం గ్రామానికి రైతు అమర శేషు మామిడితోటను కౌలుకు తీసుకున్నాడు. ఆదివారం ఉదయం మామిడి తోటకు మందును పిచికారి చేసేందుకు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన తలారి నరేంద్ర (35), తలారి చరణ్ (26) ఇద్దరు అన్నదమ్ములు కలిసి తోటలోకి వచ్చారు. కాసేపు పిచికారి చేసిన తర్వాత దాహం వేయడంతో నీళ్ల తాగేందుకు ఆ పొలంలో ఏర్పాటు చేసిన నీటి కుంట దగ్గరికి ఇద్దరూ కలిసి వెళ్లారు. మొదట అన్న తలారి నరేంద్ర వెళ్లాడు. నీళ్ల తాగేందుకు కుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడిపోయాడు. అన్నను కాపాడే ప్రయత్నంలో తమ్ముడు తలారి చరణ్ వెంటనే నీటిలోకి దిగాడు. ఇద్దరికి ఈత రాకపోవడంతో నీటిలోనే మునిగిపోయారు. అన్నను కాపాడే ప్రయత్నంలో తమ్ముడు కూడా మునిగిపోయాడు. ఇద్దరూ ఎంత సేపటికి రాకపోవడంతో తోటి కూలీలు గమనించి నీటికుంట దగ్గరికి వెళ్లారు. నీటికుంటలోకి వెళ్లి చూడగా.. అప్పటికే ఆ ఇద్దరు అన్నదమ్ములు మృతి చెంది నీటిలో తేలాడుతున్నారు. తోటి కూలీలు ఆ దృశ్యాన్ని చూసి విలపించారు. గ్రామస్థులకు సమాచారం అందించడంతో వచ్చి మృతదేహాలను బయటకు తీసారు. ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడంతో కళ్యాణదుర్గం పట్టణం, పాలవెంకటాపురంలో విషాదం నెలకొంది. అన్నదమ్ములను కోల్పోయిన కుటుంబం తీరని దుఃఖంతో శోక సంద్రంలో మునిగిపోయింది. తలారి నరేంద్రకు ఇటీవల పెళ్లి అయింది. అతడి భార్య గర్భవతిగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నీటి కుంట

సోమేశ్వర ఆలయంలో విశేష పూజలు



నటరాజస్వామికి విశేష అలంకరణ

ముళబాగిలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాణ ప్రసిద్ధమైన ప్రసన్న సోమేశ్వర ఆలయంలో మార్గశిర ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని విశేషపూజలు సాగాయి. పంచామృతాభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు. నటరాజస్వామికి అభిషేకం, ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులు మాలధారులై ప్రసాదవినియోగం చేశారు. స్థానిక కళాకారుల పాటలు అలరించాయి. ఆలయ ప్రధాన అర్చకులు ఏపీ రామనాథ్ దీక్షిత్, సోమేశ్ నేతృత్వంలో పూజాకైంకర్యాలు చేశారు. కార్యనిర్వాహక అధికారి కేవీ సుబ్రమణ్యం పర్యవేక్షించారు.

ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై యువకుడి ఆత్మహత్య



బసవరాజ్ (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసగా మారి ఫైనాన్స్ ద్వారా చేసిన అప్పులు తీర్చలేక ధారవాడ తాలూకా మంగళకట్టి గ్రామానికి చెందిన బసవరాజ్ సక్రప్పనవర్ (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బసవరాజ్ కొన్నిరోజులుగా ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడ్డాడు. ఇతను ఓ ఫైనాన్స్‌లో కలెక్షన్ పనులు చేసేవాడు. ఇలా యజమానికి చెల్లించాల్సిన రూ.3లక్షలను ఆన్‌లైన్ గేమ్‌లకు వాడేశాడు. యజమాని డిమాండ్ చేస్తే ఎలా చెల్లించాలని భయపడి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గరగ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు రోజుల పసికందును వీడి... అసోం దంపతుల ఆత్మహత్య

శ్రీనివాసపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా ఉప్పారపల్లిలో అసోం రాష్ట్రానికి చెందిన దంపతులు ఏడురోజుల పసికందును వీడి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెహమాన్ (28), ఫరిజా (22) ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు. వీరు 15 రోజులక్రితం స్థానిక శ్రీనివాసరెడ్డికి చెందిన కోళ్లఫాంలో చేరారు. వారంక్రితం బాలిక జన్మించింది. ఒక్కసారిగా పసికందును వీడి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఈ ఘటన విషాదం కలిగించింది.

చెత్త సేకరణ డ్రమ్ములు మాయం



డ్రమ్మును చోరీ చేయడంతో మిగిలిన కమ్మీలు

చేళూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరును స్వచ్ఛతకోసం పలుచోట్ల చెత్తసేకరణ డ్రమ్ములను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొన్నిచోట్ల ప్లాస్టిక్ డ్రమ్ములు కనిపించడం లేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో మాయం చేశారనే విమర్శలు ఉన్నాయి. డ్రమ్ములకోసం ఏర్పాటు చేసిన కమ్మీలు మాత్రమే కనిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జనసేన మండల కన్వీనర్ సురేష్



మాట్లాడుతున్న సురేష్

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన మండల కన్వీనర్ సురేష్ పేర్కొన్నారు. జనసేన పార్టీ మండల నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం కన్వీనర్ సురేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి జనసైనికుడు కృషిచేయాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ మద్దతుదారులను గెలిపించుకోవాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీలు ఏర్పాటుచేసి ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ అశ్వర్థనారాయణ, అమర్నాథ్, రవితేజ, రంగప్ప, నవీన్, బాలచంద్ర, అనిల్ పాల్గొన్నారు.